ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ AFTERNOON 2PM



GV MALL shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 84 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 26 అక్టోబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# తిరుపతిలోని రాజ్ పార్క్ హోటల్కు బాంబు బెదిరింపులు

తిరుపతిలోని రాజ్ పార్క్ హోటల్కు బాంబు బెదిరింపులు వచ్చాయి.

దీంతో హోటల్ లో పోలీసులు తనిఖీలు చేపట్టారు.



**తిరుపతి, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** తిరుపతిలోని రాజ్ పార్క్ హోటల్కు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో హోటల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మరోవైపు గురువారం కూడా తిరుపతిలోని పలు హోటళ్లకు బాంబు బెదిరింపులు రావడంతో కలకలం రేగింది. లీలామహల్ సమీపంలోని మూడు ప్రైవేటు హోటళ్లు, రామానుజ కూడలిలోని మరో హోటల్ కు గురువారం మెయిల్ లో బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాల దర్శనం.. ఆధ్యాత్మిక బస్సు యాత్ర ప్రారంభం

రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్లో ఆధ్యాత్మిక బస్సు యాత్రను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు.



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** స్థానిక సరస్వతీ ఘాట్లో ఆధ్యాత్మిక బస్సు యాత్రను మంత్రి కందుల దుర్గేశ్ ప్రారంభించారు. పర్యటక శాఖ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాల దర్శనం కల్పిస్తున్నారు. తొలుత కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. అక్కడినుంచి అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోట కుమారరామ భీమేశ్వర-స్వామి, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, వాడపల్లి వెంకటేశ్వ-రస్వామి ఆలయాల సందర్శన ఉంటుంది. రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్లో గోదావరి హారతితో బస్సు యాత్ర ముగియనుంది. ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

# తెలంగాణవ్యాప్తంగా బెటాలియన్ పోలీసుల ఆందోళన

ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు.

**హైదరాబాద్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరులో 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళన చేపట్టారు. మామునూరు బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. ఆందోళనల నేపథ్యంలో నల్గొండ గ్రామీణ ఎస్ఐ సైదాబాబుకు నిరసన సెగ తగిలింది. ఎస్ఐ గోబ్యాక్ అంటూ 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు. పోలీసుల కుటుంబసభ్యులపై సైదాబాబు దురుసుగా ప్రవర్తించారని నిరసనకు దిగారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. సాగర్ రోడ్డుపై ధర్నా



చేపట్టారు.

# తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది.



**అమరావతి, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంప్రారంభమైంది. మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో తెదేపా అధినేత చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించితన సభ్యత్వాన్ని సీఎంపునరుద్ధరించుకున్నారు.రూ.లక్ష కట్టినవారికిశాశ్వత సభ్యత్వం అందించనున్నారు. రూ. వంద చెల్లించి సభ్యత్వం తీసుకొన్న వారికి గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచారు. సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి చనిపోయిన రోజే అంత్యక్రియలకు రూ.పది వేలు అందించనున్నారు.కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందిస్తుంది. ఈ నేపథ్యంలో సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నేతలు, కార్యకర్తలు రికార్డు స్థాయిలో నిర్వహించాలని చంద్రబాబు పార్టీ శ్రేణులను కోరారు.

# కార్యకర్తల సంక్షేమానికి రూ.కోట్లు ఖర్చు చేసిన ఘనతతెదేపాది: మంత్రి లోకేశ్



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

**అమరావతి, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ రూ.100తో సభ్యత్వం తీసుకోవాలని 'ఎక్స్' వేదికగా మంత్రి నారా లోకేశ్ కోరారు. దీంతో రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని చెప్పారు. కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సహాయం అందుతుందని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమానికి రూ. కోట్లు ఖర్చు చేసిన ఘనత తెదేపాదని తెలిపారు. మొబైల్ ఫోన్, వెబ్సైట్, వాట్సాప్ ద్వారా సభ్యత్వం తీసుకోవచ్చని పేర్కొన్నారు. పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చని సూచించారు.

# గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

పద్మశ్రీ గ్రహీత, ప్రసిద్ధ గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.



**హైదరాబాద్, అక్టోబర్ 26 (రిపబ్లిక్‌న్యూస్):** పద్మశ్రీ గ్రహీత, ప్రముఖ గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారిక లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజనుల సంప్రదాయ గుస్సాడీ నృత్యానికి జీవం పోసి, భావితరాలకు అందిస్తున్న పద్మశ్రీ కనకరాజు(94) శుక్రవారం కన్నుమూశారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మర్లవాయికి చెందిన కనకరాజు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గుస్సాడీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2021 నవంబరు 9న పద్మశ్రీ ప్రకటించి, అప్పటి రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రదానం చేసింది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmail.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1947: రెండుసార్లు అమెరికా అధ్యక్ష పదవికి చేపట్టిన బిల్ క్లింటన్ సతీమణి హిల్లరీ క్లింటన్ జననం.
- 1950: కలకత్తాలో మిషనరీస్ ఆఫ్ చారిటీని మదర్ థెరీసా స్థాపించింది.
- 1962: భారత్ పై చైనా దాడి పర్యవసానంగా, దేశంలో మొట్టమొదటిసారి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.
- 1965: నేపథ్య గాయకుడు నాగూర్ బాబు అలియాస్ మనో జననం.
- 1985: కేరళ రాష్ట్రం నుండి వచ్చిన ఒక భారతీయ చిత్ర నటి ఆసిన్ జననం.
- 1990: దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత వి.శాంతారాం మరణం.


హిల్లరీ క్లింటన్


మదర్ థెరీసా


మనో


ఆసిన్


వి.శాంతారాం

# 'కంగువా' విడుదలకు ముందే సీక్వెల్పై క్లారిటీ

కంగువా సినిమా సీక్వెల్పై నిర్మాత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దాని షూటింగ్ వివరాలు పంచుకున్నారు.



శివ దర్శకత్వంలో సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'కంగువా రెండు భాగాలుగా ఇది రానుంది. ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్ రూపుదిద్దుకున్న ఈ సినిమా కోసం సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నవంబర్ 14న మొదటిభాగం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. దీని సీక్వెల్పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొదటి భాగం విడుదలకు ముందే సీక్వెల్కు సంబంధించిన వివరాలు పంచుకున్నారు."శివ దర్శకత్వాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. దీని స్క్రిప్ట్ రాసుకున్నప్పుడే రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నాం. రెండోభాగంలో ఉద్రన్ పాత్ర (బాబీ దేవోల్ పాత్ర) మరింత వివరణాత్మకంగా ఉంటుంది. 'కంగువా 2' ప్రీ ప్రొడక్షన్ పనులు వచ్చే ఏడాది ప్రారంభమవుతాయి. 2026లో షూటింగ్ పూర్తి చేసి.. 2027లో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం" అని నిర్మాత చెప్పారు. దీని సీక్వెల్ గురించి జ్ఞానవేల్ కూడా ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. "కంగువ' కంటెంట్ గురించి తెలియదు కాబట్టి.. దీని మొదటిభాగం వచ్చే తేదీకి మరికొన్ని సినిమాలు విడుదలయ్యే అవకాశం ఉంది. కానీ, 'కంగువ 2'తో మాత్రం ఎవరూ పోటీకి రాలేరు. ఈ విషయాన్ని నమ్మకంతో చెబుతున్నాను. సినిమా కంటెంట్ అంత బలమైనది' అని చెప్పారు. విడుదల తేదీ దగ్గర కావడంతో 'కంగువా' టీమ్ జోరు పెంచింది. వరుస ఇంటర్వ్యూలతో సినిమా విశేషాలు పంచుకుంటుంది. తాజాగా సూర్య 'అన్ స్టాపబుల్' షోలో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఆ ఫ్రాంచైజీ అయిదో భాగం.. క్లారిటీ ఇచ్చిన ఖుష్బూ..

'అరణ్మనై' అయిదో భాగం తెరకెక్కుతోందంటూ వస్తోన్న వార్తలను ఖుష్బూ ఖండించారు. ఇది అసత్య ప్రచారమని తెలిపారు.

కోలీవుడ్ దర్శకుడు సుందర్.సి



తెరకెక్కించిన ఫ్రాంచైజీ 'అరణ్మనై' (తెలుగులో 'బాక్). ఇప్పటి వరకు నాలుగు భాగాలు విడుదలై ఆకట్టుకున్నాయి. తాజాగా దీని అయిదో భాగం కూడా సిద్ధమైందనే వార్త సోషల్ మీడియాలో బాగా ప్రచారం అవుతోంది. దీనిపై నటి ఖుష్బూ క్లారిటీ ఇచ్చారు. ఆ వార్తలు ఫేక్ అని చెప్పారు. 'కోలీవుడ్లో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న అతి పెద్ద ఎంటర్టైనర్ 'అరణ్మనై'. దీని అయిదో భాగం సిద్ధమవుతుందనే ఊహాగానాలు జోరుగా ప్రచారమవుతున్నాయి. ఇందులోని నటీనటుల ఫస్ట్ లుక్ పోస్టర్లు షేర్ అవుతున్నాయి. ఇవ్వన్నీ రూమర్సే. ఈ చిత్రంపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. మేము ప్లాన్ చేసినప్పుడు స్వయంగా వెల్లడిస్తాం. అప్పటి వరకు వేచిఉండాలని' అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.'అరణ్మనై' ఫ్రాంచైజీ దాదాపు పదేళ్ల క్రితం మొదలైంది. 2014లో విడుదలైన 'అరణ్మనై' సూపర్హిట్ అందుకోవడంతో దానికి సీక్వెల్గా 'అరణ్మనై 2' తెరకెక్కించారు సుందర్. 2016లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి వసూళ్లు రాబట్టింది. దాదాపు ఐదేళ్ల గ్యాప్ తర్వాత 2021లో 'అరణ్మనై 3' విడుదలైంది. రాశీఖన్నా, ఆర్య, ఆండ్రియా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ఈ ఏడాది దీని నాలుగో భాగం ప్రేక్షకుల ముందుకువచ్చి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఇది డిస్నీహాట్స్టార్ వేదికగా అందుబాటులో ఉంది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# సీఎస్కే అభిమానులకు గుడ్న్యూస్..! రూమర్లకు చెక్ పెట్టిన ఎంఎస్ ధోనీ!

వచ్చే సీజన్ లోనే కాకుండా.. మూడేళ్లపాటు ఎంఎస్ ధోనీని మైదానంలో చూసే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. తాజాగా అతడు చేసిన వ్యాఖ్యలు అందుకు ఊతమిస్తున్నాయి.



ఐపీఎల్ 2025 సీజన్ కు ముందు మెగా వేలం జరగనుంది. ఆలోపు రిటెన్షన్, రైట్ టు మ్యాచ్తో ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తమవద్దే అట్టిపెట్టుకోవాల్సి ఉంది. దీనికి గడువు అక్టోబర్ 31 వరకు మాత్రమే ఉంది. ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా అధికారికంగా జాబితాలను విడుదల చేయలేదు. అయితే, ఒకేఒక్క ప్లేయర్ విషయంలోనే అభిమానుల్లో తీవ్ర స్థాయిలో ఉత్కంఠ నెలకొంది. అతడు ఈసారి ఐపీఎల్లో ఆడతాడా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కానీ, తాజాగా ఆ స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోనీ ఓ కార్యక్రమంలో మాట్లాడిన మాటలు ఐపీఎల్లో పాల్గొనడంపై వస్తోన్న రూమర్లకు చెక్ పెట్టినట్లైంది. మరికొన్నేళ్లు క్రికెట్ ఆడేందుకు తాను సిద్ధమవుతున్నట్లు ధోనీ వ్యాఖ్యానించాడు. అంతేకాకుండా మరో మూడేళ్ల వరకు అతడిని మైదానంలో చూసే అవకాశం ఉంది. రిటైన్ చేసుకొనే ఆటగాళ్లను కనీసం మూడేళ్లపాటు ఆడించేందుకు అవకాశం ఉంటుంది."క్రికెట్ను ఆస్వాదిస్తూ ఆడితే జట్టుకు, వ్యక్తిగతంగాను ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది. ఇకపై నేను ఆడబోయే క్రికెట్ను మరింత ఆస్వాదించాలని అనుకుంటున్నా. ప్రొఫెషనల్ గేమ్ ఆడేవారు ఎల్లవేళలా ఎంజాయ్ చేయలేరు. కానీ, నేను మాత్రం అలా ఉండకూడదని భావిస్తున్నా. కానీ, ఇది చాలా కష్టమైందే. కమిట్మెంట్స్, భావోద్వేగాలు ఉంటాయి. వీటన్నింటినీ పక్కన పెట్టేసి రాబోయే కొన్నేళ్లు ఆటను ఆస్వాదిస్తా. అందుకోసం గత తొమ్మిది నెలలుగా ఫిట్నెస్పై దృష్టిసారించా. ఐపీఎల్లో కేవలం రెండున్నర నెలలు మాత్రమే ఆడతా. అందుకోసం పక్కాగా ప్లాన్ చేసుకోవాలి. అదే సమయంలో వ్యక్తిగతంగానూ జీవితాన్ని గడపాలి" అని ధోనీ వెల్లడించాడు.

## అందం

కొన్ని కారణాల వల్ల చాలా మందికి పెదాలు నల్లగా, ఎండిపోయినట్లుగా మారి అందవిహీనంగా కనిపిస్తాయి. ఇవి చూడ్డానికి చాలా ఇబ్బందిగా కనిపిస్తాయి. వీటిని కవర్ చేసేందుకు చాలా మంది లిప్బామ్స్ వాడుతుంటారు. ముఖంలో కళ్ళు, పెదాలే ముఖ్యం. మనం స్కిన్ మెరిసేందుకు మంచి స్కిన్ కేర్ ఎలా ఫాలో అవుతామో.. అదే విధంగా, కళ్ళు, పెదాలని కాపాడుకోవాలి. పెదాలు హెల్దీగా, అందంగా ఉండేందుకు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. వెదర్, పెదాలపై వాడే ప్రోడక్ట్స్, వాయు కాలుష్యం, ఆరోగ్య సమస్యలు, నీరు తాగకపోవడం వల్ల పెదాలు పాడవుతాయి. అలాంటి సమస్యని తగ్గించేందుకు కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయి.





## రోజూ రాత్రి ఈ నూనె పెదాలకి రాస్తే ఎర్రగా మారతాయి



### బాదం ఆయిల్..



బాదం ఆయిల్ కూడా పెదాలను మృదువుగా, పింక్గా మారుస్తాయి. తేమని అందించి, డెడ్స్కిన్ని తొలగిస్తుంది. ప్రతిరోజూ బాదం నూనెతో మసాజ్ చేస్తే సహజంగానే పెదాలు ఎర్రగా మారతాయి.

### గులాబీ రేకులు, పాలు..



గులాబీ రేకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్ ఉంటాయి. ఇవి పెదాలను కాంతివంతంగా చేస్తాయి. షైనీగా చేస్తాయి. అదే విధంగా, పాలు.. పాలలోని లాక్టిక్ యాసిడ్ ఎక్స్ఫోలియేట్ చేస్తాయి. హైడ్రేట్ చేస్తాయి. లిప్ మాస్క్ చేయడానికి, తాజా గులాబీ రేకులని మెత్తగా చేసి, మిల్క్ క్రీమ్, తేనె వేసి, బాగా మిక్స్ చేసి, పెదాలకు అప్లై చేయండి. 15 నుంచి 20 నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత పాలు, నీటితో కడగాలి.

### అలోవెరా..



అలోవెరా నేచురల్గానే మంచి లక్షణాలు కలిగి ఉంటుంది. దీనిని రాయడం వల్ల పొడి, పగిలిన పెదాలు అందంగా మారతాయి. తాజా కలబంద జెల్లో కొన్ని చుక్కల ఆలివ్, కొబ్బరి నూనె కలపండి. రాత్రిపూట లిప్ మాస్క్గా, పగటిపూట లిప్బామ్గా వాడండి.

### దానిమ్మ గింజల నూనె..



దానిమ్మ గింజల నూనెలో ప్యూనిసిక్ యాసిడ్ ఉంటుంది. ఇది పెదాలను రక్షించి, పునరుజ్జీవింపజేసే యాంటీ ఆక్సిడెంట్ కొన్ని చుక్కల దానిమ్మ గింజల నూనెని ఓ టీ స్పూన్ తేనెతో మిక్స్ చేసి, పెదాలకు అప్లై చేసి 15 నిమిషాల పాటు అలానే ఉంచండి. మాస్క్ని క్లీన్ చేసుకుని తుడిచి, లిప్బామ్ రాయండి.

### పసుపు, పాలు..



పసుపులో వైద్యం చేసే లక్షణాలు ఉన్నాయి. పాలు సహజంగానే మాయిశ్చరైజర్. అరటీస్పూన్ పసుపుని ఓ టీస్పూన్ చల్లని పాలలో కలపండి. పెదాలకు అప్లై చేసి 5 నిమిషాలు ఉంచి స్క్రబ్ చేసి గోరువెచ్చని నీటితో క్లీన్ చేయండి.

### బీట్రూట్ జ్యూస్..

మీ పెదాలకు మంచి రంగుని ఇవ్వడానికి బీట్రూట్ చాలా బాగా హెల్ప్ చేస్తుంది. బీట్రూట్ వాడడం వల్ల పెదాలు సహజంగానే ఎర్రగా కనిపిస్తాయి. బీట్రూట్ సహజమైన ఎక్స్ఫోలియేటర్గా కూడా పనిచేస్తుంది. ఇది మృతకణాలు తొలగించి పెదాలకు చక్కని రంగుని ఇస్తుంది. బీట్రూట్ తురుము, దాని రసాన్ని తీయండి. ఇప్పుడు అందులో తేనె వేసి బాగా కలపండి. దీనిని పెదాలకు రాత్రి రాసి ఉదయాన్నే క్లీన్ చేయాలి.

గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.